గురుకుల ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 4: తెలంగాణ సాంఘిక గురుకులాల్లో బీసీ, ట్రైబల్ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నామని మహేంద్రహిల్స్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శీలం సునీత మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గౌలిదొడ్డిలోని గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9 వరకు ఖాళీగా ఉన్నాయని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీజీటీడబ్ల్యూఆర్ ఈఐఎస్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈ 8వ తరగతి, మల్కాజ్‌గిరిలో 6వ తతరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేయు చివరి తేదీ ఈ నెల 6వ తేదీ వరకు ఉందని, పరీక్షలు ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు కులం, ఆదాయం సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు నంబర్, బర్త్ సర్టిఫికెట్, ఒక ఫొటో అవసరమని ప్రిన్సిపాల్ చెప్పారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఈడీ కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను మూడు వారాల తరువాత సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలన్నారు. ఎల్ఎల్ఎం పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లా కోర్సుల పరీక్ష ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 12వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఈడీ పరీక్ష ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 12వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 3వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంకామ్ (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. బీఈడీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలతో పాటు పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 15వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 18 వరకు చెల్లించాలన్నారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఈ నెల 22వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వారసత్వ ఉద్యోగాలివ్వాలి

81, 85 జీవోలను అమలు చేయాలని బొల్లారం పోలీస్ స్టేషన్‌లో డిమాండ్ చేస్తున్న రాష్ట్ర వీఆర్ఏ జేఏసీ సభ్యులు

- గత ప్రభుత్వ జీవో ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్

బొల్లారం, ఫిబ్రవరి 3: వీఆర్ఏల వారసులకు ఇంకెప్పుడు ఉద్యోగాలు ఇస్తారని వీఆర్ఏ జేఏసీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ వద్ద వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వీఆర్ఏల వారసులను నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ మేరకు బొల్లారం పీఎస్‌లో వీఈఆర్ఏ జేఏసీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ పేస్కేల్, 61 ఏండ్లు దాటిన వారికి ఉద్యోగాలు ఇస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నం.81, 85విడుదల చేసిందని గుర్తు చేశారు. డిగ్రీ చదివిన వారికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఇంటర్ చదివిన వారికి రికార్డు అసిస్టెంట్లుగా, పదో తరగతి చదివిన వారికి ఆఫీస్ సబార్డినేటర్లుగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చిందని పేర్కొన్నారు. 61 ఏండ్లకు పైబడిన 3,797 మంది వారసులకు ఉద్యోగాలు ఇస్తామని జీవోలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ఎన్నికల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సహా ఇతర నేతలు తమకు అనుకూల హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయడం లేదని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేర్చి వారసత్వ ఉద్యోగుల జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల జేఏసీ సభ్యులు నాగరాజు, రాజు, నరసయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మగ్దూం మొహియుద్దీన్

ట్యాంక్ బండ్‌పై ఉన్న కవి ముగ్దూం మొహియుద్దీన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కవాడిగూడ, ఫిబ్రవరి 4: బహుముఖ ప్రజ్ఞాశాలి ముగ్దూం మొహియుద్దీన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ అన్నారు. ఆ పార్టీ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మొహియుద్దీన్ 117వ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహానికి నరసింహ, వీఎస్ బోస్ నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో పటేల్, పట్వారీ, దేశ్‌ముఖ్, భూస్వామ్య దాష్టీకాలకు వ్యతిరేకంగా తన రచనలకు పదును పెట్టారని చెప్పారు. ఓయూ విద్యార్థులతో కామ్రేడ్స్ అసోసియేషన్ ఏర్పాటులో క్రియాశీలకమైన పాత్ర పోషించారన్నారు. సిటీ కళాశాలలో లెక్చరర్‌గా తన ఉపన్యాసాలతో వేలాది మంది విద్యార్థులను ఉద్యమం వైపు నడిపించేందుకు కృషి చేశారని చెప్పారు. సాహిత్య రంగంలో అద్భుతమైన కృషి చేసి అభ్యుదయ రచయితల సంఘాన్ని, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాన్ని ఏర్పాటు చేసారన్నారు. నిజాం పాలనలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యమయ్యారని గుర్తుచేశారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డితో పాటు మగ్దూం మొహియుద్దీన్ పనిచేసారన్నారు. మూడు వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచారని చెప్పారు. నిరంతరం ప్రజలను చైతన్యం చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సన్నద్ధం చేయడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నేత ప్రమ్‌పావని, నాయకులు ఛాయాదేవి, నళిని, శ్రీకాంత్, సలీం, ఉమర్‌ఖాన్, జేరిపోతుల కుమార్, కొమురవెల్లి బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులకు నిధులివ్వండి



సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్

బొల్లారం, ఫిబ్రవరి 4: చిన్నతోకట్ట కట్ట మైసమ్మ ఆలయం నుంచి జీఎం అంజయ్య మెమోరియల్ హిందూ శ్మశనవాటిక వరకు సీసీరోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ మంగళవారం కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కట్ట మైసమ్మ ఆలయం నుంచి శ్మశానవాటిక వరకు రోడ్డు అసౌకర్యంగా ఉండడంతో స్థానికులకు, ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించే సమయంలో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలోనే 2018లో అంచనాలు మంజూరైనా ఇంతవరకు నిధులు కేటాయించకపోవడంతో అసౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

'విదేశీ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం'

సమావేశంలో మాట్లాడుతున్న ఓఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఓయూలో చదువుతున్న విదేశీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని ఓయూ అధికారులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి ఓయూ ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ (ఓఐఏ)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించి, ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటి నుంచి ప్రతీ నెలా నాలుగో శనివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించి, సమస్యలను తెలుసుకుంటామని అధికారులు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులే సమావేశం ఏర్పాటు చేయడం పట్ల విదేశీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ, జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ ఎంఏ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

దవాఖానలో కంటోన్మెంట్ బోర్డు సీఈఓ తనిఖీ

బొల్లారం, ఫిబ్రవరి 4: బోయిన్‌పల్లిలోని వీఆర్ దవాఖానను మంగళవారం కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, బోర్డు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఇటీవల వైద్యుల నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టింకుగౌడ్ ఇచ్చిన ఫిర్యాదుతో తనిఖీ చేశారు. వీఆర్ దవాఖాన భవనానికి అనుమతులు ఉన్నాయా? ట్రేడ్ లైసెన్సు, ఆస్తి పన్ను చెల్లిస్తున్నారా అంటూ ఆరా తీశారు. రెండు రోజుల్లో దవాఖాన అనుమతి పత్రాలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అనుమతులు లేవని తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆకట్టుకున్న హరికథా గానం



కళాకారులను సత్కరించిన జస్టిస్ గ్రంధి భావాని ప్రసాద్, కేవీ రమణచారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 4: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శృంగేరి శంకర మఠంలో హరికథా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీనివాస కల్యాణం హరికథా గానం పలువురుని విశేషంగా ఆకట్టుకుంది. డాక్టర్ వై.వేంకటేశ్వర్లు(భాగవతార్)చే శ్రీనివాస కల్యాణం అలరించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్ పాల్గొని కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణచారి, దాసరి వెంకట రమణ, రామప్రభాకర్, వెంకటరావు, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూను సందర్శించిన డీబీటీ బృందం

వివరాలు తెలుసుకుంటున్న డీబీటీ నిపుణుల బృందం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: కేంద్ర ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ)-బూస్ట్ టు వర్సిటీ ఇంటర్ డిసిప్లినరీ లైఫ్‌సైన్స్ డిపార్ట్‌మెంట్స్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ ప్రోగ్రామ్ (బిల్డర్) పురోగతిని సమీక్షించేందుకు ఆ విభాగానికి చెందిన నిపుణుల బృందం ఓయూను మంగళవారం సందర్శించింది. ఈ ప్రాజెక్టు కింద మంజూరైన నిధులతో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆన్‌సైట్ మూల్యాంకనం నిర్వహించారు. ఈ నిధులతో వివిధ విభాగాలు, కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పరికరాలను తనిఖీ చేశారు. నార్త్ ఈస్టర్న్ హిల్ వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రమేశ్‌శర్మ, డీబీటీ శాస్త్రవేత్త డాక్టర్ గరిమాగుప్తా, డీబీటీ కోఆర్డినేటర్ ప్రత్యూష్‌సిన్హాతో కూడిన బృందానికి వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ.జితేందర్‌కుమార్‌నాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్య, సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణసాగర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభాకర్, సీఎఫ్ఆర్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్త బూర్గుల, సీపీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణతో కూడిన బృందం వివరణాత్మక నివేదికను అందజేసింది.

'ఈఎస్ఐ'ని సొసైటీగా మార్చొద్దు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 4: బీమా వైద్య సేవల శాఖను మూసివేసి, ఈఎస్ఐ సొసైటీ ఏర్పాటు ప్రయత్నాలను తాము వ్యతిరేకిస్తున్నామని ఐఎంఎస్, టీఎస్‌జీఓ డైరెక్టరేట్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వీరన్నగౌడ్ అన్నారు. టీఎస్‌జీఓ బీమా వైద్య సేవల శాఖ (ఈఎస్ఐ) ఉద్యోగులు మంగళవారం 8వ రోజు డైరెక్టరేట్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ దవాఖానలు, డిస్పెన్సరీల ద్వారా 20 లక్షల మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న బీమా వైద్య సేవల శాఖను యథావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

క్విజ్‌లో సత్తా చాటిన ఇంజినీరింగ్ విద్యార్థులు

ఎన్టీపీసీ ఎలక్ట్రాన్ క్విజ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ఓయూ ఇంజినీరింగ్ కళాశాల బృందానికి బహుమతి అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఎన్టీపీసీ నిర్వహించిన దక్షిణ భారత ప్రాంతీయ విభాగం ఎలక్ట్రాన్ క్విజ్ పోటీల్లో ఓయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తా చాటి మొదటి స్థానంలో నిలిచారు. పోటీల్లో మొత్తం 46 ఇంజినీరింగ్, 96 మేనేజ్‌మెంట్ కళాశాలలు పాల్గొనగా, ప్రాథమిక రౌండ్లలో హోరాహోరీగా తలపడి ఆరు జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఓయూ జట్టు అద్భుత విజ్ఞానాన్ని, పోటీతత్త్వాన్ని ప్రదర్శించి మొదటి స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల నిలిచింది. ఈ రెండు జట్లు న్యూఢిల్లీలో జరుగబోయే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన పోటీలకు ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ కుమార్, ఎన్టీపీసీ జీఎం ఎస్.ఎన్.పాణిగ్రాహి హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, మూడు స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, ఫైనల్ చేరిన మిగిలిన జట్లకు రూ.నాలుగు వేల చొప్పున నగదు బహుమతి సైతం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 4: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ వైఎంసీఎ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా బుధవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైఎంసీఎ ఫీడర్ పరిధిలోని లింగంపల్లి, నారాయణగూడ బ్లడ్ బ్యాంక్, రాఘవేంద్రస్వామి టెంపుల్, నృపతుంగ కాలేజీ, పోలీసు క్వార్టర్స్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

వీడియో ఎడిటింగ్ బూట్ క్యాంప్ ప్రారంభం

ఓయూలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీవీ రంజని

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 4: ఓయూలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో నాలుగు రోజుల వీడియో ఎడిటింగ్ బూట్ క్యాంప్ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని, కోఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగ అవకాశాలను పెంచే ప్రాముఖ్యత గురించి వివరించారు. డిజిటల్ యుగంలో వీడియో ఎడిటింగ్ అనేది మార్కెటింగ్, సోషల్ మీడియా, కంటెంట్ క్రియేషన్, ఎడ్యుకేషన్, అడ్వర్టైజింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో కీలక నైపుణ్యంగా మారిందన్నారు. ఆకర్షణీయమైన వీడియోల ద్వారా బ్రాండింగ్ మెరుగుపడుతుందని చెప్పారు. వ్యక్తిగత, వృత్తిపరమైన స్థాయిలో సందేశాలను స్పష్టంగా అందించడంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ క్యాంపు ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించడంతో పాటు వారి ఉద్యోగావకాశాలను పెంచేందుకు, సృజనాత్మకతను మెరుగుపరిచేందుకు సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు.

రథసప్తమి వేడుకలు

సూర్యభగవాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు

బొల్లారం, ఫిబ్రవరి 4: తిరుమలగిరి ఎస్పీకాలనీలోని సూర్య భగవాన్ ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ నిర్వాహకులు, పోలీసులు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టారు. కాగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఏడో వార్డు బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్ భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్‌కుమార్, రాజిరెడ్డి, వేణుగోపాల్, అనురాధ, పద్మావతి, రుక్మయ్య, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం

పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, హెచ్ఎం శౌరి తదితరులు

బేగంపేట్, ఫిబ్రవరి 4: రాంగోపాల్‌పేట్ డివిజన్ ఓల్డ్ నల్లగుట్ట ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఇస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల నృత్య ప్రదర్శనలు చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నబత్తిని శౌరి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డిజిటల్‌గా తీర్చిదిద్ది ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. పాఠశాలకు దాతల సహకారంతో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇస్య ఫౌండేషన్ ప్రతినిధులు హైమంతి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులను విస్మరించిన కేంద్రం

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్డీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులను పూర్తిగా విస్మరించిందని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ (డీఎస్డీ) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డీఎస్డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోకన్వీనర్లు భారతి, వెంకట్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కొన్నేండ్లుగా దివ్యాంగులకు రూ.300 పెన్షన్ ఇస్తుందని, దానిలో ఒక్కరూయి కూడా పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీ దివ్యాంగుల సంక్షేమ అధికారిని కలిసి వికలాంగుల సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం మార్పు రాలేదన్నారు. దివ్యాంగుల సమస్య పరిష్కారం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై జాతీయస్థాయిలో మారో ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఉద్యమ కార్యచరణ త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీ నాయకులు పాల్గొన్నారు.

బీమాలో ఎఫ్‌డీఐ వంద శాతం పెంచడంపై నిరసన

కవాడిగూడ, ఫిబ్రవరి 4: కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఇన్సూరెన్స్ రంగంలో బీమా చట్ట సవరణ బిల్లు ప్రవేశ పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐఐఈఎ) పిలుపు మేరకు సికింద్రాబాద్ డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్(ఐసీఈయూ) ఆధ్వర్యంలో కవాడిగూడలోని సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నిరసన వ్యక్తం చేశారు. బీమా చట్ట సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జోనల్ నాయకులు జి.తిరుపతయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. బీమా కంపెనీలకు పాంపోజిల్ లైసెన్స్‌లు జారీ చేయడం, నిర్ధారిత మూల ధనాన్ని తగ్గించడం, ఏజెంట్లు ఒకటి కన్నా ఎక్కువ బీమా